## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వినాయక్‌నగర్/ నవీపేట్, ఆగస్టు 8 : నవీపేట్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న సయ్యద్ రఫీక్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో దాడి చేశారు. రఫీక్ నుంచి 500 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది భూమన్న, భోజన్న, అవినాష్, ఉత్తమ్, విష్ణు, రాంబచ్చన్, లక్ష్మన్ పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

సిరికొండ, ఆగస్టు 8 : మహారాష్ట్ర నుంచి పెద్దవాల్గోట్‌కు ఉపాధి నిమిత్తం వచ్చిన వాంగరే రాజు (32) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. హెడ్‌కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంగరే రాజు మరో వ్యక్తితో కలిసి కొండూర్ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాంగరే రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరోవ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు దవాఖానకు తరలించారు. మహారాష్ట్రకు చెందిన రాజు మేస్త్రీ పని నిమిత్తం పెద్దవాల్గోట్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మురికి కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, ఆగస్టు 8 : జిల్లాకేంద్రంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో మురికి కాలువలో గురువారం ఓ వ్యక్తి మృదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు ధర్పల్లి మండలం దుబ్బాకకు చెందిన వడ్ల రమేశ్ (49)గా గుర్తించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి, విచారణ చేపడుతున్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

వినాయక్‌నగర్, ఆగస్టు 8 : నిజామాబాద్ మండలం గొల్లగుట్ట తండాకు చెందిన రాజు గ్రామ చెరువులో మృతదేహమై తేలాడు. రూరల్ ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన రాజు.. తరచూ తన భార్య సంయుక్త, కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈనెల 6న కూడా గొడవపడి, తాను చనిపోతానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల టైంటేబుల్ విడుదల

డిచ్‌పల్లి, ఆగస్టు 8 : టీయూ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్. బీఎల్‌ఐఎస్సీ 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల టైంటేబుల్ విడుదల చేశామని పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి



నిర్మల హృదయ పాఠశాలలో మొక్కలతో విద్యార్థులు

నందిపేట్/ మాక్లూర్/ ఆర్మూర్‌టౌన్/ ఖలీల్‌వాడి/ మోస్రా (చందూర్)/ ఇందల్వాయి, ఆగస్టు 8: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో మొక్కలు నాటడంతోపాటు పరిశుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్, అమ్రాద్ తండా గ్రామాల్లో అధికారులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీడీవో జైకాంత్రి, కార్యదర్శి రాధిక, మాజీ సర్పంచులు లింగన్న, కిషన్ లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. నందిపేట్‌లోని మోడల్ స్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 100 మొక్కలు నాటామని క్లబ్ అధ్యక్షుడు శౌరీబాబు అన్నారు. ఆర్మూర్‌లోని 24వ వార్డులో మున్సిపల్ సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ పురాణీపేట్, పల్లికొండ, బాచన్‌పల్లి గ్రామాలను సందర్శించి స్వచ్ఛదనంపై గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. పురాణీపేట్, బాచన్‌పల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో జావిద్, ఏపీవో నర్సయ్య, ఏపీఎం రవీందర్, సీసీ నరేశ్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని కుకునూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటామని ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్ తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి, ఆశ వర్కర్లు, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాలలో మొక్కలు తీసుకువచ్చి పాఠశాల పరిసర ప్రాంతాల్లో నాటారు. మొక్కల ప్రాముఖ్యతపై హెచ్‌ఎం సరిత, ప్రైమరీ ఇన్‌చార్జి సురేఖ అవగాహన కల్పించారు. మోస్రాలో ప్రత్యేకాధికారి సాయిలు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. మొక్కలను పంపిణీ చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్యనగర్ ప్రధాన రోడ్డు పక్కన మురికి కాలువను లయన్స్ సహారా ఆధ్వర్యంలో తొలగించి, మొక్కలు నాటారు. సుమారు 300 మొక్కలు నాటినట్లు అధ్యక్షుడు నర్సింహారావు తెలిపారు. కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్‌పత్‌రెడ్డి, కార్యదర్శి ఉదయ సూర్యభగవాన్ పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి, మల్లాపూర్ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటారు. ప్రధాన వీధుల గుండా చెత్తచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు.



అమ్రాద్‌లో మొక్క నాటుతున్న మాజీ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు



మోస్రాలో మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి సాయిలు



పురాణీపేట్‌లో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న అధికారులు



కందకుర్తిలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

## రెండు రోజుల్లో మార్పు కనిపించాలి

రెంజల్, ఆగస్టు8: మండలంలోని కందకుర్తిలోని పాఠశాలలో ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం, మైదానంలో గడ్డి పెరగడంతో కార్యదర్శి సతీశ్‌పై ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపై నిర్లక్ష్యం మానుకోవాలని హితవుపలికారు. రెండు రోజుల్లో మార్పు కనిపించాలని కార్యదర్శిని ఆదేశించారు. మండలంలోని కందకుర్తి, నీలా, పెపర్‌మిల్, కూనేపల్లి, గ్రామాల్లో ఎంపీడీవో వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంటెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



ఫుట్‌బాల్ క్రీడాకారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కంఠేశ్వర్, ఆగస్టు 8 : జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్స్‌లో ఇందూర్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజామాబాద్ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పుట్టినిల్లని, క్రీడాకారులకు సరైన సౌకర్యాలతో మినీ స్టేడియం అవసరమని ప్రభుత్వానికి సిఫారసు చేశామని తెలిపారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా రుణమాఫీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

వినాయక్‌నగర్, ఆగస్టు 8 : రాష్ట్రంలో 65 లక్షల మంది రైతులు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 15 లక్షల మంది రైతులకు తూతూ మంత్రంగా రైతు రుణమాఫీ చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో 2.75 లక్షల మంది రైతులు ఉండగా.. మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణమాఫీ కేవలం 46,456 మందికి మాత్రమే జరిగిందని తెలిపారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగ అభియాన్‌లో భాగంగా ఇండ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలని అర్బన్ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఆగస్టు 8 : టీయూలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాలులో కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈవెంట్ మేనేజర్లుగా బి.శివ, సాయికుమార్, సతీశ్, శ్రీకాంత్ వ్యవహరించగా.. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు చాలా ప్రాముఖ్యత ఉందని, విద్యార్థులు ఇంగ్లిష్ కమ్యూనికేషన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వామి కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ భాషపై వివరించారు. ఈవెంట్ మెంటార్‌గా బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఆంజనేయులు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ప్రొఫెసర్లు కైసర్ మహ్మద్, రాంబాబు, అపర్ణ, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు నాగుల పంచమి

సుభాష్‌నగర్, ఆగస్టు 8 : నాగుల పంచమి పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా మహిళలు శుక్రవారం జరుపుకోనున్నారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రముఖ ఆలయాల్లో ఉన్న పాములపుటల్లో ఆవుపాలు పోసి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. పాలు పోసిన తర్వాత పుట్టమన్ను, ఆవుపాలతో అక్కాచెల్లెళ్లు అన్నాదమ్ముళ్ల కండ్లు కడగడం సంప్రదాయం.

**నేడు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆవుపాల పంపిణీ..**

నాగుల పంచమి నేపథ్యంలో ఇందూరు గోసేవా సమితి, గోకుల్ సేవాసమితి, గోశాల సేవా సమితి తదితర సంస్థల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఆవు పాలు పంపిణీ చేయనున్నారు. సుమారు లక్షన్నర లీటర్ల ఆవుపాలను పంపిణీ చేయనున్నట్లు ఇందూరు గోసేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

## బాలికలపై అఘాయిత్యాలను అరికట్టాలి

ఖలీల్‌వాడి, ఆగస్టు 8 : బాలికలపై అఘాయిత్యాలను అరికట్టాలని ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనిత, సుజాత మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల బాలికలపై లైంగికదాడులు పెరిగిపోయానని, నిందితులనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ‘వ్యక్తి గత కారణాలతోనే సెలవు పెట్టాను’

వినాయక్‌నగర్, ఆగస్టు 8 : తాను వ్యక్తిగత కారణాలతోనే సెలవుపై వెళ్లాలని, ఇతర కారణాలతో కాదని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 15 రోజులు సెలవుల్లో ఉంటానని, అనంతరం తిరిగి వస్తానని ఆయన వెల్లడించారు.

## ఎమ్మెల్యేను కలిసిన తాళ్ల రామడుగు వీడీసీ

సిరికొండ / ధర్పల్లి, ఆగస్టు 8 : సిరికొండ మండలంలోని తాళ్ల రామడుగు వీడీసీ కార్యవర్గం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితోపాటు ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌ను గురువారం కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేకు గ్రామంలోని సమస్యలను విన్నవించారు. ధర్పల్లి సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డితోపాటు నలుగురు డైరెక్టర్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

ఖలీల్‌వాడి, ఆగస్టు 8 : నగరంలోని సీతారాంనగర్‌కు చెందిన గొల్లగుట్ట ప్రభుత్వ గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య విద్యాబోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదా నజీబ్, అధ్యాపకులు భార్గవి, సుస్మిత, విజయలక్ష్మి, స్టాఫ్‌నర్సులు మిలిందా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ధర్పల్లి, ఆగస్టు 8 : మండలంలోని దమ్మన్నపేట్ సబ్‌స్టేషన్‌లో రూ. కోటీ 20 లక్షలతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్ గురువారం ప్రారంభించారు. గతంలో సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో లో–వోల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో వినియోగదారులకు లో–వోల్టేజీ సమస్య తీరింది. కార్యక్రమంలో ఏఈ జగదీశ్, డీఈ ఉత్తమ్, ఏడీఈ శ్రీనివాస్, ఎల్‌టీఈ ఎస్‌పీఎం నటరాజ్, ఏఈ ప్రొటెక్షన్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.



*జనగామలో న్యాయవాదులపై పోలీసుల భౌతిక దాడిని నిరసిస్తూ రెండోరోజు గురువారం జిల్లా కేంద్రంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి, కోర్టు ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదులపై దాడులు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు.*

*– వినాయక్‌నగర్, ఆగస్టు 8*

## విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న నాయకులు

నందిపేట్, ఆగస్టు 8: మండల కేంద్రంలో నిర్మిస్తున్న దుర్గాదేవి మండప నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.51 వేల విరాళాన్ని వారి కుటుంబ సభ్యుల పేరున గురువారం అందజేశారు. ఆ విరాళాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జోర్‌పూర్ రాము, మంతెన శ్రీను, నాగచిన్నయ్య, మచ్చర్ల సతీశ్, రెడ్డిగారి నరేశ్, బంధం సన్నీ, సుంకరి సుమన్, సందీప్, చుక్కబట్ల దీపక్, మంతెన చిన్నయ్య పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అటవీ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వినాయక్‌నగర్, ఆగస్టు 8 : అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు సంజయ్ గౌడ్, రవిమోహన్ భట్ అన్నారు. నిజామాబాద్ మండలపరిధిలోని మల్కాపూర్ తండాలో అటవీ చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. అటవీ భూములను ఆక్రమించడం, చెట్లను నరకడం నేరమని అన్నారు. మొక్కల సంరక్షణకు కృషిచేయాలని రూరల్ ఎస్సై మహేశ్ సూచించారు.

## ‘స్వచ్ఛదనం- పచ్చదనం’ సమర్థవంతంగా నిర్వహించాలి

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 8: ‘స్వచ్ఛదనం– పచ్చదనం’ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని సీడీఎంఏ డైరెక్టర్ జిల్లా ప్రత్యేకాధికారి అన్నపూర్ణ సూచించారు. గురువారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం– పచ్చదనంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఏఈలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శక్కర్‌నగర్‌లో ఆయిల్‌బాల్స్ వేయించడం, దోమల నివారణకు చేపట్టిన చర్యలను ఆమె పరిశీలించారు. శక్కర్‌నగర్‌లో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయరాజ్‌తో కలిసి పరిశీలించారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణమ్మ తనిఖీ చేశారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ రాజుతో చర్చించారు.



శక్కర్‌నగర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అన్నపూర్ణ

## ఈవీఎం గోడౌన్ పరిశీలన

కంఠేశ్వర్, ఆగస్టు 8 : జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం పరిశీలించారు. సాధారణ ఎన్నికలు ముగిసి, నిర్ణీత గడువు పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి భద్రపర్చిన గదులను పరిశీలించారు. ఈసీ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు ఉన్నారు.

## బుద్ధదేవ్ భట్టాచార్య మృతితీరని లోటు

ఖలీల్‌వాడి/శక్కర్‌నగర్, ఆగస్టు 8 : పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యా మృతి కమ్యూనిస్ట్ పార్టీలకు తీరని లోటు అని సీపీఎం నాయకులు అన్నారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళులర్పించారు. అంతకుముందు వయానాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు ఓమయ్య, రాజయ్య, రంజిత్, నర్సింగ్‌రావు, అమర్, సాయి పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద గురువారం పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. కలకత్తాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఆయన మృతి చెందాడని పేర్కొన్నారు. నాయకులు శంకర్ గౌడ్, గంగాధరప్ప పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శక్కర్‌నగర్, ఆగస్టు 8: జిల్లాలోని గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు హైదరాబాద్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గంగాధర్ గౌడ్ వినతిపత్రం అందజేశారు. గీత పని నేర్చుకున్న వారికి టీఎఫ్‌టీ లైసెన్సులు మంజూరీ చేయించాలని, ఈతచెట్ల రేషియోను పెంచాలని పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గంగాధర్ గౌడ్ తెలిపారు.




*భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో రోడ్డు బురదమయం కావడంతో మహిళలు గురువారం వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. గ్రామంలోని కొత్త గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు నడవలేని స్థితికి చేరింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. – భీమ్‌గల్, ఆగస్టు 8*

## ఏటీఎంలో చోరీకి యత్నం

ఎడపల్లి, ఆగస్టు 8: మండల కేంద్రంలోని నయాబాదు ప్రాంతం మంగళ్‌పాడ్ చౌరస్తా వద్ద ఇండియా 1 ఏటీఎంలో దుండగులు గురువారం చోరీకి యత్నించారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బుధవారం రాత్రి 2 గంటలకు బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఏటీఎంలో చోరీకి విశ్వప్రయత్నం చేశారు. బయటినుంచి ఎవరో వచ్చినట్లు అలికిడి కావడంతో ఉడాయించారు. ఏటీఎం నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీవో

మోర్తాడ్, ఆగస్టు8: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలోని జీపీలో గురువారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే, వీధి కుక్కల బెడదకు సంబంధించిన సర్వే నిర్వహించాలని సూచించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ ఎంపీడీవోలు రాజశ్రీనివాస్, తిరుమల గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

## తల్లిపాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ సంగీత

ఆర్మూర్‌టౌన్, ఆగస్ట్8: స్థానిక రెండో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం తల్లులకు అవగాహన కల్పించారు. స్థానిక కౌన్సిలర్ సంగీత హాజరై తల్లులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ శోభ, మున్సిపల్ ప్రత్యేకాధికారి షకీల్, వార్డు ప్రత్యేకాధికారి చక్రధర్ పాల్గొన్నారు.

## పాఠశాలకు సౌండ్‌సిస్టమ్ వితరణ

మోర్తాడ్, ఆగస్టు8: హైదరాబాద్‌కు చెందిన వేల్పుల విజయ్, మోర్తాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మనోజ్‌రెడ్డి స్నేహితులు. పాఠశాలకు సౌండ్ సిస్టం అవసరముందని తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్న విజయ్ రూ.39,400 విలువ చేసే సౌండ్‌సిస్టమ్‌ను గురువారం అందజేశారు. వేల్పుల విజయ్, మనోజ్‌రెడ్డిలను హెచ్‌ఎం ప్రభాకర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ జాతీయ జెండా దహనం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు8: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బంగ్లాదేశ్ జాతీయ జెండాను బీజేపీ నాయకులు గురువారం దహనం చేశారు. బంగ్లాదేశ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆపార్టీ నాయకుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులను ఊచకోతలు, హత్యలు చేయడం దారుణమన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసను ఖండిస్తున్నామన్నారు. దాడులను వెంటనే ఆపాలన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట్ గంగాధర్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్ జాతీయ జెండాను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

## సంక్షిప్తంగా..

- **ఫారెస్ట్ రిటైర్డ్ అధికారి ఇంట్లో చోరీ-** వినాయక్‌నగర్, ఆగస్టు 8 : నగరంలోని ఆర్యనగర్‌లో ఉండే ఫారెస్టు శాఖ రిటైర్డ్ అధికారి నారాయణ ఇంట్లో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆయన తన కుటుంబీకులతో కలిసి ఇంటికి తాళం వేసి, బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి బీరువా ధ్వంసం చేసి ఉండడంతో మూడు తులాల బంగారం చోరీకి అయినట్లు గుర్తించారు. నాల్గో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.
- **ఆలయంలో..** – ధర్పల్లి, ఆగస్టు 8 : మండలంలోని ప్రాజెక్టు రామడుగులో ఉన్న వేంకటేశ్వరాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విక్రమ్ తెలిపిన కథనం ప్రకారం.. పూజారి గణపతి శ్రీనివాసశర్మ గురువారం ఆలయానికి వెళ్లే సరికి గర్భగుడి తాళం పగులగొట్టి, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. స్వామివారి వెండి కిరీటంతోపాటు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.
- **ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు -** భీమ్‌గల్, ఆగస్టు 8: కళాశాలలో ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిబాబు సూచించారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.
- **విద్యార్థులకు అవగాహన -** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు8: కోమన్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.
- **బోదేపల్లిలో ఆయుర్వేద వైద్యశిబిరం -** బాల్కొండ, ఆగస్టు 8: బోదేపల్లిలో గురువారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. కిసాన్‌నగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పరీక్షలు చేసి పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.
- **జింక్, సల్ఫర్ పోషకాలతో అధిక దిగుబడులు-** మోర్తాడ్, ఆగస్టు8: వరిపంటలో జింక్, సల్ఫర్ పోషకాలతో కూడిన మందులను వాడడంతో అధిక దిగుబడులు సాధించ వచ్చుని సల్ఫర్ మిల్స్ లిమిటెడ్ సౌత్ ఇండియా మేనేజర్ రాజశేఖర్ రైతులకు సూచించారు. సుంకెట్ గ్రామంలో వరి క్షేత్రాలను గురువారం సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడారు.
- **వరి పంటల పరిశీలన -** రుద్రూర్, ఆగస్టు 8 : మండలకేంద్రంతో పాటు శ్రీనగర్, వర్ని, మోస్రా, అంబం, నెహ్రూనగర్ గ్రామశివారులో వరి పంటను రుద్రూర్ వరి చెరుకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. పంటకు ఎండాకు తెగులు, ఆకు నల్లి పురుగు ఆశించినట్టు గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు కృష్ణచైతన్య, దినేశ్, రవీందర్, సౌందర్య, మేఘలత, దివ్య వివరించారు.
- **ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకుంటే 10 శాతం రాయతి-** ఆర్మూర్‌టౌన్, ఆగస్టు8: పెండ్లిళ్లు, శుభ కార్యాలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకుంటే 10 రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.
- **మహాసభను విజయవంతం చేయాలి -** మాక్లూర్, ఆగస్టు8: ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని ద్వారకానగర్‌లో నిర్వహించనున్న పీవోడబ్ల్యు ఎడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యు డివిజన్ కార్యదర్శి దెశెట్టి రాద బోర్గాం(కె)లో అన్నారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడారు.
- **క్షీరాభిషేకం -** మాక్లూర్, ఆగస్టు 8: మండల కేంద్రంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటానికి బంజారాలు గురువారం క్షీరాభిషేకం చేశారు. బంజారా ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహం పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని కోరడంతో ఈ కార్యక్రమం నిర్వహించామని బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్ తెలిపారు.
- **వేల్పూర్‌లో ఆరోగ్య సర్వే -** వేల్పూర్, ఆగస్టు 8: మండల కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
- **కందకుర్తి ప్రత్యేక అధికారిగా ఎంపీవో రఫిఅహ్మద్–** రెంజల్, ఆగస్టు 8 : కందకుర్తి గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీవో రఫి అహ్మద్‌ను నియమిస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ తెలిపారు. ప్రత్యేక అధికారిగా కొనసాగిన తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ స్థానంలో ఎంపీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు.
- **బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం-** ఏర్గట్ల, ఆగస్టు8: బట్టాపూర్ తాండలో 12 ఏండ్లు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన శేర్ల శ్రీనివాస్ గౌడ్‌ను అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తండా వాసులు గురువారం సన్మానించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**VECHILE FOR SALE**

★ 2022 AUGUST TATA MAGIC EXPRESS DIESEL 10 SEATER IS FOR SALE. FOR DETAILS PLEASE CONTACT CELL: 9014093238

NTZ-340235

**LAND FOR SALE**

★2.16 ఎకరాల వ్యవసాయ భూమి (లావుని పట్టా), దుబ్బాక గ్రామం, ధర్పల్లి మండలం, నిజామాబాద్ జిల్లాలో అమ్మకానికి కలదు. Ph: 9769559562.

NT-Klick




**PLOT FOR SALE**

★“వరలక్ష్మీ వ్రతం” ఆఫర్... 1 ప్లాట్ బుకింగ్‌పై 2 గ్రాముల గోల్డ్ కాయిన్ ఫ్రీ... ఫ్రీ... 1 లక్షకే 121 గజాల ప్లాట్... ఎర్రచందనం మొక్కలతో నారాయణఖేడ్. Cont: 8500664291.

NT-332613

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.